W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

28-11-2025



09

## మొదలైన ఎన్నికల సందడి

ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల స్వీకరణ ఘట్టం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు నుంచే జిల్లాలోని గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు ఆశావహులు ఉత్సాహం చూపించారు.



02

## గుడి.. బడి పక్కనే లిక్కర్ దందా

ఖమ్మం నగరంలో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి పారువేట స్థలం (జమ్మిబండ) వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై తీవ్ర దుమారం రేగింది. దసరా, శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరిగే ఈ పవిత్ర స్థలానికి ఆనుకుని, పాఠశాలలు, ఆసుపత్రుల మధ్యలో వైన్ షాప్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతుండటంతో స్థానికులు, బీజేపీ నాయకులు భగ్గుమన్నారు.



06

## పల్లె పోరులో ఎర్ర కోటల గర్జన

పల్లెసీమలు రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో, ప్రశాంతంగా ఉండే పల్లెల్లో ఇప్పుడు అధికారం కోసం అలుపెరగని పోరాటం మొదలైంది. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది.



### మరో అక్రమ దందాకు దారి చూపిన

# ఇసుక మాఫియా

10

## అబాసుపాలైన అటవీ సిబ్బంది

- లారీ యజమానులకు, అటవీ సిబ్బందికి వివాదం
- మణుగూరు సీఐ చొరవతో సద్దుమణిగిన వివాదం
- ఫోనుకు స్పందించని తాసిల్దార్
- చట్ట ప్రకారమే చార్జ్: ఎఫ్‌డీఓ
- ప్రభుత్వ జీవో తప్పనిసరి: న్యాయ కోవిదులు

మణుగూరు, మహా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఇసుక మాఫియా మళ్లీ రెచ్చిపోయింది. తమ అక్రమ దందాకు కొత్త మార్గాలు, కొత్త పన్నాగాలు వెతుక్కుంటూ అధికారులను, గ్రామస్థులను, అటవీ సిబ్బందిని ఒకేసారి గందరగోళానికి గురి చేస్తోంది. ఇప్పటికే మల్లేపల్లి - రాజుపేట, చిన్న రాయి గూడెం, అనంతరం, అన్నారం పరిధిలోని ఇసుక ర్యాంపులు ఎన్నోసార్లు ప్రజా ఆందోళనలకు, లారీ, గ్రామస్తుల మధ్య గొడవలకు వేదికైన విషయం తెలిసిందే. మహిళలు, చిన్నారులు సైతం రహదారిపైకి వచ్చి ఆందోళనలు చేసిన దృశ్యాలు ప్రజలు మరచిపోలేదు.

# గుడి.. బడి పక్కనే లిక్కర్ దందా

## అధికారులపై ఖమ్మం వాసుల మండిపాటు

- పవిత్రమైన జమ్మిబండ వద్ద మద్యం షాపా?
- భక్తుల మనోభావాలతో చెలగాటమా?
- జమ్మిబండ వద్ద వైన్ షాపును తక్షణమే రద్దు చేయాలి
- పోలీసుల తీరుపై బీజేపీ ఫైర్.. లిక్కర్ మాఫియాకు ఏజెంట్లుగా మారారంటూ ధ్వజం
- టెక్నికల్ రూల్స్ కాదు.. 'స్పిరిట్' ముఖ్యం
- ఎక్సైజ్ అధికారులకు బీజేపీ నేతల క్లాస్
- రెండు రోజుల్లో తేల్చకపోతే ఉద్యమం ఉధృతం అధికారులకు బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాస్తుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు స్థానికుల అల్టిమేటం











**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి పారువేట స్థలం (జమ్మిబండ) వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై తీవ్ర దుమారం రేగింది. దసరా, శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరిగే ఈ పవిత్ర స్థలానికి ఆనుకుని, పాఠశాలలు, ఆసుపత్రుల మధ్యలో వైన్ షాప్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతుండటంతో స్థానికులు, బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. గురువారం నాడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు ,జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, నేతృత్వంలో ప్రజలు పెద్ద ఎత్తున జమ్మిబండ ప్రదేశానికి తరలివచ్చారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం నగరంలోని అత్యంత పవిత్రమైన జమ్మిబండ ప్రాంతం గురువారం నాడు ఉద్రిక్తతకు దారితీసింది. ప్రతి ఏటా దసరా ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగే ఈ ఆధ్యాత్మిక ప్రదేశంలో, సరిగ్గా గుడి స్థలానికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతుండటంపై స్థానికులు, బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, మహిళలు, స్థానికులు పెద్ద ఎత్తున జమ్మిబండ వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. సంఘటనా స్థలంలో ఏర్పాటు చేస్తున్న షాపును పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రజా సమస్యపై పోరాడుతుంటే పోలీసులు లిక్కర్ షాపు యజమానికి ప్రైవేట్ సెక్యూరిటీగా, ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని నాయకులు ఆరోపించారు. కేవలం యజమాని ఫిర్యాదు మేరకు ప్రజలను, మహిళలను అక్కడి నుండి వెళ్ళగొట్టడం, బెదిరించడం ఎంతవరకు సమంజసమని వారు పోలీసులను నిలదీశారు. ప్రైవేట్ ప్రాపర్టీ అయినా సరే, అది ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉంటే ప్రశ్నించే హక్కు తమకు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రజలు , నాయకులు ర్యాలీగా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ , డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అధికారులతో జరిగిన చర్చల్లో బీజేపీ నేతలు పలు కీలక అంశాలను లేవనెత్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేవాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలనే రూల్ ఉన్నప్పటికీ, అధికారులు కేవలం టేపులతో కొలతలు వేసి 101 లేదా 102 మీటర్లు ఉందని టెక్నికల్ గా అనుమతులు ఇవ్వడం సరికాదని హితవు పలికారు. చట్టంలోని అక్షరాలకంటే, చట్టం వెనుక ఉన్న ఉద్దేశం ముఖ్యమని, పక్కనే ఉన్న హాస్పిటల్స్ లో పనిచేసే నర్సులు, రాత్రి వేళల్లో విధులు ముగించుకుని వెళ్లే మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతంలో వైన్ షాప్ ఏర్పాటు చేస్తే తాగిన మైకంలో ఆకతాయిలు చేసే న్యూసెన్స్ వల్ల స్థానిక నివాసితులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడతారని, హిందువుల పవిత్ర మనోభావాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గడిల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శీలం పాపారావు, నాయకులు వీరవెల్లి రాజేష్ గుప్తా, బోయినపల్లి సురేష్, మంద సరస్వతి,, రుద్ర గాని మాధవ్, రీగన్ ప్రతాప్, పాలెపు రాము, కందుల శ్రీకృష్ణ, రజినీ రెడ్డి, మనీ , తుమ్మ హిందూ , మేడా సంపత్, పొట్టిమూర్తి జనార్ధన్, పోటీమూర్తి వాణి తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
28-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు





# మంత్రి తుమ్మల పరామర్శ

**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని కాకర్లపల్లి రోడ్డు సమీపంలో నివాసముంటు మంగళవారం అనారోగ్య కారణాలతో మరణించిన స్వర్గీయ చల్లగుళ్ళ నారాయణ రావు కుటుంబాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు సీనియర్ నాయకులు చల్లగళ్ళ నరసింహారావు, పువాళ్ళ ఉమా, చీకటి రంగారావు, టోపీ శ్రీను, చల్లగళ్ళ పుల్లయ్య, వినుకొండ కృష్ణ, నరేందర్ రెడ్డి ఉన్నారు.

# శుభ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి,మహా:** నియోజకవర్గ పరిధిలోని గురువారం జరుపుకుంటున్న పలు శుభ కార్యక్రమాలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామలోని తండాలో బర్మావత్ వెంకటేశ్వరరావు నాగమణి దంపతుల కుమార్తె సుజాత, విజయ్ ల వివాహానికి హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. రుద్రాక్ష పల్లి పంచాయతీలోని రంగాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం రమేష్ కుమారుల నూతన పంచల వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం యాతాల కుంట గ్రామంలో ధరావత్ రామకృష్ణ, సుజాత దంపతుల కుమార్తె భవాని వివాహ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





# సంతృప్తికరమైన అభిరుచి అలవాటుగా ఉండాలి

- ప్రతి ఒక్కరికి సంతోషాన్ని కలిగించే జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- చిన్నప్పటి నుండి తపాలా స్టాంపులను అసక్తిగా సేకరించాను
- వివిధ రకాల స్టాంపులతో దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి ప్రతిబింబిస్తాయి
- డి.పి.ఆర్.సి. భవనంలో నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లాస్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్






**ఖమ్మం, మహా:** తమకు సంతోషాన్ని కలిగించే సంతృప్తికరమైన అభిరుచి ప్రతి ఒక్కరికి అలవాటుగా ఉండాలని, దాని వలన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస పెరగడానికి దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. డి.పీ.ఆర్.స భవనంలో మంగళవారం జిల్లా తపాలా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఖమ్మం జిల్లా స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ 2025 ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల తపాలా స్టాంపుల ప్రదర్శనను విద్యార్థులతో కలిసి అసక్తిగా కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చిన్నతనంలో తాను పోస్టల్ స్టాంపులను చాలా ఆసక్తితో సేకరించేవాడినని, స్నేహితులతో తపాలా స్టాంప్ లను మార్చుకొని చాలా పెద్ద కలెక్షన్ పెట్టుకునే వాడినని గుర్తు చేసుకున్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ లో పాల్గొన్నడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చిన్నతనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారని, స్నేహితుల పేరెంట్స్ గల్ఫ్ దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి స్టాంపులు తీసుకుని రావాలని కోరినట్లు కలెక్టర్ తెలిపారు. స్టాంపుల సేకరణ చాలా సంతోషాన్ని కలిగించిందని, అది ఒక దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి, విజ్ఞానం చూపిస్తుందని అన్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ పిల్లలకు చాలా ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి ఒక్క వ్యక్తికి ఆనందాన్ని కల్గించే ఒక హాబీ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. హాబీ మన వ్యక్తిత్వం, పరిశోధన తత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస, క్రమశిక్షణ పెరగడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రస్తుత జనరేషన్ ఎక్కువ డిజిటల్ వైపు అడుగులు వేస్తుందని, ఔట్ డోర్ యాక్టివిటిస్, స్నేహితులతో బయట ఆడుకోవడం చాలా తగ్గిపోయిందని, దీని వలన లాభాల కంటే నష్టం ఎక్కువగా జరుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పిల్లలు డిజిటల్ ప్లాట్ ఫారం మొబైల్, ఇన్స్టగ్రామ్, ఫెస్బుక్, వాట్సప్, యూట్యూబ్ లలో తక్కువ సమయం గడపాలని కలెక్టర్ సూచించారు. ఫిలాటెలిక్ అలవాటు పోస్టల్ స్టాంపు సేకరణ చాలా ఆనందం కలిగిస్తుందని, మనం కొంచెం శ్రమ పెట్టి సేకరించిన స్టాంపులు లేదా ఇతర హాబీల వలన మనకు అధిక సంతృప్తి వస్తుందని అన్నారు. పోస్టల్ స్టాంపు సేకరణ అలవాటు భవిష్యత్తు తరాలకు అందించాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా పోస్టల్ భీమాపాలసీ పరిహారం చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ పర్యవేక్షకులు వీరభద్ర స్వామి, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం,మహా:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ 3 లో ఉన్న డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో



ఎన్నికల సజావు నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు, ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని, ఎతికల్ ఓటింగ్, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలకు సంబంధించి సరైన సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మీడియా సెంటర్ ద్వారా పాత్రికేయులకు అవసరమైన సరైన సమాచారం సకాలంలో అందించడం జరుగుతుందని, ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఊహాగానాలకు చెందిన వార్తలను వెరిఫై చేసుకోకుండా రాయవద్దని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్ లోని ఎంసిఎంసీ కమిటీని సంప్రదించి అనుమతి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, డిపిఓ ఆశాలత, అదనపు పిఆర్వో ఎండి. అయూబ్ ఖాన్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది చింతల శ్రీనివాస్ రావు, చావా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
28-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఒక్క బాల్య వివాహం జరగకుండా చూద్దాం

**సిడబ్ల్యూసీ చైర్పర్సన్ భారతరాణి** | **జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత**




**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూద్దామని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గుంటుపల్లి భారత రాణి పిలుపునిచ్చారు నవంబర్ 27 జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్ )సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్ నందు బాలికల జూనియర్ కళాశాల లో వందరోజుల బాల్య వివాహ నిరోధక కార్యాచరణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అనేది ప్రజల భాగస్వామ్యంతో కూడుకున్న అంశమని కావున ప్రజలు యువత కౌమార బాలబాలికలు అధికారులు ఇలా అందరి సమన్వయంతోటి సమిష్టి కృషితోటి ప్రయత్నం చేస్తే 2030 లోపే బాల్యవివాహాలను మనం ఖమ్మం జిల్లాలో సమూలంగా నిర్మూలించవచ్చని పునరుద్ఘాటించారు. బాలికలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాతనే వివాహం గురించి ఆలోచించాలని బాలలకు సూచించారు

జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని భేటీ పడావో బేటి బచావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల యొక్క విద్య ఆరోగ్యం ఉపాధి అవకాశాల పట్ల నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి తెలపాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ మాట్లాడుతూ ఆడపిల్లలు కౌమార దశలో వచ్చి మార్పుల పట్ల ఆందోళన పడకుండా అంగన్వాడి ఆశా కార్యకర్తలు మరియు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో నివృత్తి చేసుకోవాలని రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకుంటూ చక్కని ఆరోగ్యంతో చదివి తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే బాల బాలికలకు మత్తు పదార్థాలు సామాజిక మాధ్యమాలు చరవాణి వినియోగం పట్ల ప్రతి వారాంతంలో విషయాన్ని నిపుణులచే కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిని సరైన మార్గంలో ఉండేలా చూస్తున్నామని తెలిపారు యువత భవిష్యత్తు పట్ల సరైన అవగాహనతోటి చదువుకోవాలని చెడు వ్యసనాలకు బానిసైతే జీవితం దుర్భరం అవుతుందని అన్నారు

# భద్రాద్రి జిల్లా కాంగ్రెస్‌కు దేవి ప్రసన్న స్ఫూర్తి

**దేవి ప్రసన్నతో మర్యాదపూర్వక భేటీలో ఎమ్మెల్యే పాయం**



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం ప్రజాభవన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా కాంగ్రెస్కు నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన దేవి ప్రసన్నకు ఎమ్మెల్యే పాయం శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి జిల్లా ఏర్పాటు అయ్యాక తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికై జిల్లా మహిళ కాంగ్రెస్ నేతలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అనంతరం జరిగిన భేటీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దిశగా పార్టీ పటిష్టీకరణ, గ్రామ, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమన్వయం, ప్రజలకు కాంగ్రెస్ సంకల్పాలు చేరవేసే వ్యూహాలపై ఇద్దరూ విస్తృతంగా చర్చించారు. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం, బూత్ సభ్యులను చైతన్యవంతం చేయడం, జిల్లాలో పార్టీ బలపడేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణ అవసరమనే అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజా సేవల విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడం కోసం పరస్పర సహకారమే కీలకమని ఈ సందర్భంగా ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, పినపాక మండల అధ్యక్షుడు గొడిశాల రామనాథం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రహీం పాషా, 14 టైర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, గాండ్ల సురేష్, ఆవుల సర్వేశ్వరరావు, చలపతితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్ వాడీ స్కూల్ మూసివేత







**కూసుమంచి, మహా:** ఎంతో మందిని సస్పెండ్ చేసిన, నోటీసులు, మెమోలు ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగుల్లో మార్పు రావడం లేదు.. వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ నెలనెలా జీతాలు తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటన ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం గురువారం చోటు చేసుకుంది. మంగళితండా పంచాయతీ సీత్లా తండా మిని అంగన్వాడీ కేంద్రంకు ఆ స్కూల్ టీచర్ తాళం వేసి ఉంచారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్కూల్ తెరిచి ఉండాల్సి ఉండగా, మధ్యాహ్నం సమయంలోనే స్కూల్ ను మూసివేసి తాళం వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఓ విద్యార్థి తండ్రి తన కుమారుడ్ని స్కూల్ కు తీసుకురాగా తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో వైరల్ అయ్యింది. ఈ స్కూల్ పరిస్థితి పై గత ఏడాది నుంచి పై అధికారులకు కంప్లైంట్ ఇస్తూనే ఉన్నామని చెబుతున్నాడు. అయినప్పటికీ ఎవరు పట్టించుకోవట్లేదని వీడియోలో బాధితుడు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమె పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. స్కూల్ ప్రతి రోజు నడిచే విధంగా చూడాలన్నారు.మరీ అధికారులు స్పందిస్తారా..? వేచి చూడాలి.

# ప్రజా సమస్యలపై ఎంపీ బలరాంకు అక్షర మహిళా మండలి వినతి

**మణుగూరు, మహా:** పినపాక నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేణుక అక్షర మహిళా మండలి ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రేణుక చౌదరి క్యాంప్ కార్యాలయం ద్వారా మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గురజాల గోపి ఆదేశాల మేరకు మణుగూరు పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని రహదారులు, కాలువలు, తాగునీరు, వెలుగులు తదితర ప్రజా సమస్యలపై మండలి సభ్యులు ఎంపీకి సమస్యల వివరాలు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ బలరాం నాయక్ హామీ ఇచ్చినట్లు మండలి నాయకులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో కన్నాపురం వసంత రెడ్డి, బీ రేణుక, డాకూరి సౌజన్యతో, కాంగ్రెస్ కార్యకర్తలు, మండలి సభ్యులు పాల్గొన్నారు.



## రైతు పరిహారం కష్టతరం చేసే విత్తన బిల్లు

**ఖమ్మం సిటీ, మహా:** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు కార్పొరేట్ కంపెనీల వ్యాపారం సులభతరం చేసి రైతుల పరిహారం కష్టతరం చేసే అవకాశం ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్ లో సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశం లో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విత్తన బిల్లు 2025 విత్తన కంపెనీలు చేసే మైనర్ తప్పులను నేర రహితం చేయడం , నమోదు చేయని విత్తనాలు విక్రయం ,రికార్డులు నమోదు చేయకపోవడం లాంటి నేరాలపై పెనాల్టీలు విధించడం కు మాత్రమే పరిమితమైందని నకిలీ విత్తనాలు వచ్చిన నాణ్యత లోపంతో దిగుబడులు తగ్గిన నష్టపోయిన రైతులకు పరిహారం ఈజీ గా పొందే అంశాన్ని సక్రమంగా పొంద పర్చలేదని కోర్టుల ద్వారానే పరిహారం పొందాలనే అంశం ఆర్థికం తోపాటు కాలయాపనతో కూడిన అంశం అని రాంబాబు అన్నారు. విదేశాల్లో రిజిస్ట్రీ అయిన విత్తనాలు భారతదేశంలో రైతులకు విక్రయించుకునే అవకాశం కల్పించడం అంటే భారతదేశ విత్తన నియంత్రణ విదేశీ కంపెనీలు చేతుల్లోకి వెళుతుందని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, ఎస్ కె మీరా, సహాయ కార్యదర్శులు గొడవర్తి నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్, వజ్జా రామారావు,బోడేపూడి వీరభద్రం,ప్రతాపనేని వెంకటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, శీలం సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు





**ఖమ్మం, మహా:** ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం నుండి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ మొదలైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఏలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై పూర్తి భాధ్యతతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కలెక్టర్ వెంట రఘునాథపాలెం మండల తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని విస్తృత తనిఖీలు: పోలీస్ కమిషనర్



**ఖమ్మం, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టామని పోలీస్ కమిషనర్ తెలిపారు. అర్ధరాత్రి సమయాల్లో తిరుగుతున్న అనుమానిత వ్యక్తుల వివరాలు, వేలిముద్రలను తనిఖీ చేస్తున్నారని అన్నారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణలో వుంటాయన్న నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ గస్తీ పెంచి, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. హోటళ్ళు, లాడ్జీలపై పోలీసులు సోదాలు నిర్వహించి అనుమానిత వ్యక్తుల పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి , రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణా కట్టడి చేసేలా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని తెలిపారు.

# ఖమ్మం గడ్డపై తెలుగుదేశం సత్తా చాటాలి

- మిత్రపక్షాలతో సమన్వయం.. సర్పంచ్ పీఠం కైవసం
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం.. గ్రామస్థాయి నుంచి కదలిరండి
- ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



**ఖమ్మం, మహా:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చాటడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య కార్యకర్తలు, నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు ఒక్కొక్కరుగా మాట్లాడుతూ గత పాలకులను గద్దె దించి, ప్రస్తుత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కృషి, సహకారం మరువలేనిదని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇకపై గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకత్వం మొత్తం సమష్టిగా కృషి చేసి, తమతో కలిసి వచ్చే మిత్రపక్షాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులను అంచనా వేస్తూ, వీలైనంత వరకు ఏకగ్రీవాలకు ప్రయత్నించాలని, లేదంటే పోటీ చేసి సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను గెలిపించు కొని రావాలని దిశానిర్దేశం చేశారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రజాదరణను, పట్టును ఈ ఎన్నికల ద్వారా నిరూపించుకోవాలని డాక్టర్ వాసిరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ పసుపు జెండా ఎగరేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ కీలక సమావేశంలో టిడిపి ఖమ్మం జిల్లా ముఖ్య నేతలు కొండబాల కర్ణాకర్, మల్లెంపాటి అప్పారావు, వద్దే విజయ్, గుత్తా సీతయ్య, చెరుకూరి చలపతి రావు, రాజేశ్వరి, వనమా వాసు, మందడపు సుధాకర్, పోటు రామారావు, వాసిరెడ్డి భాస్కరరావు, కనుకుంట్ల కుమార్, ఆర్ ఎం రామయ్య, చంద్ర రవి, మందపల్లి కోటేశ్వరరావు, చలసాని ఝాన్సీ, మందపల్లి రజిని, రావట్ల సత్యనారాయణ, రంజిత్, ప్యారిస్ వెంకన్న, తాత సుధాకర్, కీలారు సురేందర్ తదితరులతో పాటు వివిధ గ్రామాల శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యూనిఫైడ్ కౌన్సిల్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు



**సత్తుపల్లి,మహా:** యూనిఫైడ్ కౌన్సిల్ ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానంపై నిర్వహించే జాతీయస్థాయి పోటీ పరీక్షలో సత్తుపల్లి విద్యాలయం, శ్రీ చైతన్య కరికులం విద్యార్థులు విశిష్ట ఫలితాలు సాధించారు.ఈ పరీక్షలో బాలికల విభాగంలో దాసరి ఖాన్వి ఆల్ ఇండియా 7వ ర్యాంకు , కే.నిషా 10వ ర్యాంకు, మాన్విత 12వ ర్యాంకు సాధించారు. ఘనత కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు యూనిఫైడ్ సైబర్ ఒలంపియాడ్ (యు.సి.ఓ) గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ తో పాటు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేశారు. బాలుర విభాగంలో తన్విక్ నాయుడు, సాయి చరణ్, సాత్విక్ హర్ష వర్ధన్ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ గెలుచుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానంలో కోడింగ్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, సైబర్ సురక్షితపై గంట వ్యవధిలో నిర్వహించే జాతీయస్థాయి పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, రానున్న రోజుల్లో ఉన్నతంగా చదివి పాఠశాల, తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య, ఖమ్మం జోన్ కోఆర్డినేటర్ కృష్ణారావు పాల్గొన్నారు.

## స్థానిక సాధారణ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

**మణుగూరు, మహా:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమీషన్ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మూడు విడుతలగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మణుగూరు మండలంలోని 14 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్న విషయము తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్లో భాగంగా గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభ మైంది. 14 పంచాయతీలకు గాను 8 నామినేషన్ కేంద్రాలను సహాయ ఎన్నికల అధికారి, మణుగూరు ఎంపీడీవో శ్రీనివాస్ రావు ఏర్పాటు చేశారు. నామినేషన్ల నేపథ్యంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ పాటి నాగబాబులు నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.



# పల్లె పోరులో ఎర్ర కోటల గర్జన



## లోకల్ డీల్స్.. వ్యూహాత్మక ఎత్తుగడలు

రాష్ట్ర స్థాయిలో పొత్తులు ఉన్నప్పటికీ, పంచాయతీ ఎన్నికల స్వభావం రీత్యా జిల్లా కమిటీలకు, మండల కమిటీలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ వామపక్ష అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఎక్కడైతే పార్టీకి గెలిచే సత్తా ఉందో అక్కడ ఒంటరి పోరు చేస్తారు. ఎక్కడైతే కాస్త బలహీనంగా ఉన్నారో, అక్కడ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, బదులుగా వార్డు మెంబర్ల సీట్లు లేదా ఉప సర్పంచ్ పదవుల కోసం బేరసారాలు ఆడుతున్నారు. అలాగే, ఉమ్మడి శత్రువులైన ఇతర పార్టీలు గెలిచే అవకాశం ఉన్నచోట, ఓట్లు చీలకుండా కాంగ్రెస్ తో సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించారు. స్థానిక పరిస్థితులు, గ్రామాభివృద్ధి, సామాజిక సమీకరణాలను బట్టి ఈ నిర్ణయాలు ఎక్కడికక్కడ మారుతూ ఉంటాయి. అంటే ఒక గ్రామంలో మిత్రులుగా ఉన్నవారు, పక్క గ్రామంలోనే బద్ధ శత్రువులుగా తలపడే విచిత్రమైన పరిస్థితి ఈ ఎన్నికల్లో కనిపించబోతోంది.

## అసలు టార్గెట్ ఎంపీటీసీ, జడ్పీటీసీలే.. కింగ్ మేకర్లుగా మారే ఛాన్స్

సర్పంచ్ ఎన్నికలు కేవలం సెమీఫైనల్స్ మాత్రమేనని, అసలైన ఫైనల్స్ రాబోయే మండల , జిల్లా పరిషత్ ఎన్నికలేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి కాబట్టి, సీట్ల పంపకాలు అధికారికంగా ఉంటాయి. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లో తమ సత్తా చాటితేనే, రేపు పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎక్కువ సీట్లు డిమాండ్ చేయడానికి అవకాశం ఉంటుందని వామపక్షాలు భావిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలను, అనేక మండల పరిషత్ అధ్యక్ష పదవులను డిసైడ్ చేసే శక్తి కమ్యూనిస్టుల చేతిలోనే ఉంది. వారి మద్దతు లేకపోతే ఈ జిల్లాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా స్వీప్ చేయడం అసాధ్యం. అందుకే ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల ద్వారా తమ బలాన్ని ప్రదర్శించి, భవిష్యత్తులో "కింగ్ మేకర్లు"గా చక్రం తిప్పాలని సీపీఐ, సీపీఎంలు పక్కా ప్లాన్ తో ముందుకు వెళ్తున్నాయి.

## చింతకానిలో రగులుతున్న ప్రతీకార జ్వాలలు.. మధిరపై ప్రత్యేక ఫోకస్

ఈ ఎన్నికల్లో అత్యంత సెన్సేషనల్ పాయింట్ ఏదైనా ఉందంటే అది ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గమే. ఇటీవల చింతకాని మండలంలో సీపీఎం సీనియర్ నేత, సౌమ్యుడు సామినేని రామారావు దారుణ హత్యకు గురవడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనతో స్థానిక కమ్యూనిస్ట్ శ్రేణుల్లో ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ఇది కేవలం ఒక నాయకుడి హత్యగా కాకుండా, తమ పార్టీపై జరిగిన దాడిగా సీపీఎం భావిస్తోంది. ఈ నేపథ్యంలో చింతకాని మండలంతో పాటు మధిర నియోజకవర్గంలో జరిగే సర్పంచ్ ఎన్నికలను సీపీఎం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. "మా నాయకుడిని చంపారు.. ఇప్పుడు మా సత్తా ఏంటో ఓట్ల ద్వారా చూపిస్తాం" అనే కసి కార్యకర్తల్లో కనిపిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ తో పొత్తు ఉన్నా, లేకపోయినా.. సీపీఎం తన సత్తా చాటడానికి సర్వశక్తులూ ఒడ్డనుంది. ఈ పరిణామం అధికార పార్టీకి మింగుడు పడని అంశంగా మారింది.

- హస్తం కుస్తీలో కామ్రేడ్ల కొత్త ఎత్తుగడ!
- కమ్యూనిస్టుల 'సైలెంట్ ఆపరేషన్' షురూ!
- మధిరలో మంటలు.. చింతకానిలో చిచ్చు..
- సామినేని హత్యతో మారిన పొలిటికల్ సీన్
- ఉనికి కోసం సాగుతున్న ధర్మయుద్ధాలు!
- జిల్లాల్లో అగ్గిరాజేస్తున్న పొత్తు చిక్కులు..
- కేడర్‌కు 'హై'కమాండ్ ఫ్రీ హ్యాండ్

**ఖమ్మం బ్యూరో, మహా:** పల్లెసీమలు రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో, ప్రశాంతంగా ఉండే పల్లెల్లో ఇప్పుడు అధికారం కోసం అలుపెరగని పోరాటం మొదలైంది. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. అయితే, రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి అధికార కాంగ్రెస్, దాని మిత్రపక్షాలైన సీపీఐ, సీపీఎంల బంధంపైనే పడింది. హైదరాబాద్ లో "దోస్తీ" అంటూ చేతులు కలిపిన నాయకులు, పల్లెల్లో మాత్రం "కుస్తీ"కి సై అంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన వామపక్షాలు, ఈ స్థానిక సమరంలో మాత్రం సరికొత్త, సంచలనాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. "స్నేహం కోసం పార్టీని బలిపెట్టలేం.. మా అడ్డాలో మాదే రాజ్యం" అంటూ కమ్యూనిస్టులు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అధికార పార్టీకి ముచ్చుమటలు పట్టిస్తోంది. అసలు సిసలైన రాజకీయ చదరంగం ఇప్పుడు గ్రామాల్లో మొదలైంది.



## మిత్రపక్షమా? ప్రత్యర్థా?.. తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ను గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఒకే తాటిపైకి వచ్చాయి. ఆ మైత్రి ఫలించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సీపీఐకి ఎమ్మెల్యే పదవి కూడా దక్కింది. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో పంచాయతీ ఎన్నికలు చిచ్చు రేపాయి. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల గుర్తులు ఉండకపోయినప్పటికీ, గ్రామాల్లో రాజకీయ ఆధిపత్యం నిరూపించుకోవడానికి ఇవి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో, తమకు తిరుగులేని బలం ఉన్న గ్రామాల్లో కాంగ్రెస్ కోసం తప్పుకునే ప్రసక్తే లేదని ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు తేల్చి చెప్పాయి. ఇది కేవలం సీట్ల సర్దుబాటు సమస్య కాదు, పార్టీ ఉనికికి సంబంధించిన జీవన్మరణ సమస్యగా వామపక్షాలు భావిస్తున్నాయి. దశాబ్దాలుగా ఎర్రజెండా రెపరెపలాడిన గ్రామాలను మిత్రపక్షం పేరుతో కాంగ్రెస్ కు అప్పగిస్తే, భవిష్యత్తులో అక్కడ పార్టీ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అందుకే "ఫ్రెండ్లీ కాంటెస్ట్" పేరుతో కొన్నిచోట్ల భీకర పోరుకు సిద్ధమవుతున్నారు.

## కంచుకోటల్లో 'ఎర్ర' జెండా పట్టు.. తగ్గని కామ్రేడ్ల పట్టుదల

తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పడిన భద్రాద్రి–కొత్తగుడెం, సూర్యపేట, యాదాద్రి–భువనగిరి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో కమ్యూనిస్టులకు ఇంకా బలమైన ఓటు బ్యాంకు, పటిష్టమైన క్యాడర్ ఉంది. రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఉండే గ్రామ కమిటీలు మాత్రం రాజీకి ససేమిరా అంటున్నాయి. ముఖ్యంగా ఈ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో సీపీఎం, సీపీఐలకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇలాంటి చోట్ల కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నప్పటికీ, అధికారంలో ఉంది కాబట్టి పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకునేది లేదని ఎర్రసైన్యం హెచ్చరిస్తోంది.

FOLLOW: @ANNTELUGU
28-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక

# ఖమ్మం-అశ్వారావుపేట రహదారికి మహార్దశ!

- కేంద్ర మంత్రి గడ్కరీకి తుమ్మల లేఖ.. సానుకూల స్పందన
- గుంతల రోడ్లకు చెక్ పెట్టేలా 'వన్ టైం ఇంప్రూవ్‌మెంట్' ప్లాన్
- మరో కొత్త జాతీయ రహదారికి ప్రతిపాదన
- జగ్గయ్యపేట టూ కొత్తగూడెం వయా వైరా!
- జంక్షన్ల రూపురేఖలు మారాల్సిందే..
- డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పక్కాగా ఉండాల్సిందే
- ప్రయాణికుల నరకయాతనకు ముగింపు పలికే దిశగా అడుగులు
- గడ్కరీతో తుమ్మల ఫోన్ మంతనాలు





**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లా రహదారుల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నడుం బిగించారు. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారి, ప్రయాణికులకు నరకప్రాయంగా తయారైన ప్రధాన రహదారుల దుస్థితిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఖమ్మం%-%అశ్వారావుపేట రహదారిని తక్షణమే బాగు చేయడంతో పాటు, జిల్లాకు మరో కొత్త జాతీయ రహదారిని మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఘాటుగా లేఖ రాశారు. కేవలం లేఖకే పరిమితం కాకుండా స్వయంగా ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల లేఖలోని ముఖ్యాంశాలు, కేంద్రం స్పందన, జిల్లాలో కీలక మార్పులు జరగనున్నాయి. ఖమ్మం జిల్లా రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రంతో జరిపిన సంప్రదింపులు ఫలించే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాసిన లేఖలో తుమ్మల ప్రధానంగా ఖమ్మం నుండి అశ్వారావుపేట వెళ్లే జాతీయ రహదారి దయనీయ స్థితిని కళ్లకు కట్టారు. ఈ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధమవుతున్నప్పటికీ, ఆ ప్రక్రియ పూర్తయి పనులు మొదలయ్యే సరికి కనీసం ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. అయితే అప్పటివరకు ప్రయాణికులు గుంతల రోడ్లపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించలేరని, అందుకే తక్షణ పరిష్కారంగా 'వన్ టైం ఇంప్రూవ్మెంట్' (రెన్యువల్) పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. రహదారికి ఉన్న అంతరాష్ట్ర ప్రాధాన్యతను కూడా మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తెచ్చారు. ఇది జాతీయ రహదారి 365బి బి లో భాగమని, భవిష్యత్తులో రాబోయే గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గంలోనూ ఉందని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, వైజాగ్ పోర్టులకు వెళ్లే భారీ వాహనాలు, హైదరాబాద్ నుంచి ఆంధ్రకు వెళ్లే ట్రాఫిక్ అంతా ఈ రూట్ నుండే వెళ్తుందని వివరించారు. భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు ఉపరితలం పూర్తిగా దెబ్బతిందని, ఎన్‌హెచ్ఏఐ వారు చేస్తున్న ప్యాచ్‌వర్కు ఏమాత్రం నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే శాశ్వత పరిష్కారం లభించే లోపు, ఉన్న రోడ్డును బలోపేతం చేసి ప్రయాణానికి అనువుగా మార్చాలని కోరారు. ఎరోవైపు జిల్లాలోని కీలక జంక్షన్ల అభివృద్ధిపైనా మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి సారించారు. కొణిజర్ల, కల్లూరు మున్సిపాలిటీ, పెనుబల్లి, దమ్మపేట వంటి రద్దీ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జంక్షన్లు మరియు గ్రామాల పరిధిలో రోడ్లను ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో నాలుగు వరుసల రహదారి నిర్మాణం, డివైడర్లు, రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు సెంట్రల్ లైటింగ్, వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక జిల్లా రవాణా చిత్రపటాన్ని మార్చేలా మరో భారీ ప్రతిపాదనను కూడా మంత్రి తుమ్మల కేంద్రం ముందు ఉంచారు. జగ్గయ్యపేట నుండి కొత్తగూడెం వరకు వయా వైరా మీదుగా కొత్త జాతీయ రహదారిని మంజూరు చేయాలని కోరారు. జాతీయ రహదారి-65 (జగ్గయ్యపేట)ని జాతీయ రహదారి-30 (కొత్తగూడెం)తో అనుసంధానించే ఈ కొత్త లైన్ వల్ల రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ఈ రోడ్డు పూర్తయితే భద్రాచలం వెళ్లే భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా, సిమెంట్ పరిశ్రమలు, పాల్వంచ, మణుగూరు ప్రాంతాల్లోని పరిశ్రమలకు రవాణా కనెక్టివిటీ గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు, మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ అండ్ ట్రాన్స్పోర్ట్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్‌కు కూడా మంత్రి తుమ్మల లేఖలు రాశారు. ప్రజల భద్రత, జిల్లా కనెక్టివిటీ దృష్ట్యా తక్షణమే నిధులు, అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో, త్వరలోనే ఖమ్మం జిల్లా రహదారులకు కొత్త కళ రానుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భక్తాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠకు శంకుస్థాపన

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగరంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ సమీపంలో కొలువైన శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవానికి గురువారం అంగరంగ వైభవంగా శంకుస్థాపన జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తాంజనేయ స్వామి వారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అర్చకులు హరీష్ సంకల్పించగా, నేడు ఆలయ పునః ప్రతిష్ఠ పనులకు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ పునుకొల్లు నీరజ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పట్ల తన నిబద్ధతను చాటుకుంటూ, నిర్మాణ పనుల కోసం ఆమె తక్షణమే రూ. 20 వేల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ భక్తాంజనేయ స్వామి దేవాలయం ఎంతో



పురాతనమైనదని, మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి, ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురోహితులు యుగేందర్, ఆలయ కమిటీ సభ్యులు వడ్డబోయిన శంకర్, వడ్డబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి రాత, ఉపన్యాస ప్రతిభ పరీక్ష

**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల సీనియర్, జూనియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ రాత, ఉపన్యాస ప్రతిభా పరీక్షను గురువారం నిర్వహించారు. ఇంగ్లీష్ సీనియర్ మండల స్థాయి రాత పరీక్షల్లో కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ముత్తినేని రోహిత ప్రథమ స్థానం దక్కించుకోగా, జూనియర్స్ విభాగంలో జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నంద్రు విశ్వ సన్నిద్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంగ్లీష్ స్పీచ్ సీనియర్ విభాగంలో పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి ప్రసన్న ప్రథమ స్థానంలో నిలవగా, జూనియర్ ఇంగ్లీష్ స్పీచ్ విభాగంలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకర్ల విద్యార్థి ముత్తినేని



బిందు శ్రీ మొదటి బహుమతి సాధించడం జరిగింది. ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జూలూరుపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య ఉత్తమ ప్రతిభ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ కె కాజా మియా, టి సాల్మన్ రాజ్, సీతారామరాజు, బి సునీత, డి శంకర్, భవాని, రామిశెట్టి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ఉమా, పి ఉమామహేశ్వరి, వి శకుంతల, బోడ కృష్ణ, పి రామనాథం పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
28-11-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లి గద్దెల దర్శనం కోసం వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 6.30 గంటలకు, మధ్యాహ్నం 12.30 గంటలకు రెండు ప్రత్యేక సర్వీసులు మేడారం వైపు పంపనున్నట్లు తెలిపారు. మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తల్లి సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవచ్చని సూచించారు. ప్రతి ఆదివారం భక్తుల కోరిక మేరకు అదనపు బస్సులను కూడా నడపనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9490553145 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆర్టీసీ సూచించారు.



# దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించాలి

**నేలకొండపల్లి, మహా:** దివ్యాంగుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించాలని టీడీ.జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య సూచించారు. మండల కేంద్రంలో గురువారం సంఘం సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... వచ్చే నెల 3 న జరిగే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పలు కార్యాక్రమాలు చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టో లో దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవటం బాధాకరమని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు దివ్యాంగులు పోటీ చేసిన చోట ఇతరులు పోటీ చేయకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులునాగేశ్వరరావు, వీరన్న, పుల్లయ్య, రమాదేవి, అనిత, వర్ష, నాగలక్ష్మి, వేణు, మురళీధర్, సురేష్, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీను, రామారావు, రమణచారీ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కోల్ ఇండియా కబడ్డీ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణను కొత్తగూడెం ఏరియాలో నిర్వహించుటకు యాజమాన్యం నిర్ణయించింది. దీనిలో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ కాలనీలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం నందు ఈనెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగే కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణకు ప్లే గ్రౌండ్ ను క్రీడాకారుల కొరకు ఏర్పాటు చేసిన వసతి గృహాలను గురువారం సంబంధిత అధికారులు ఎజిఎం(సివిల్) డిజిఎం(పర్సనల్)జీవి.మోహన్ రావు, డిజిఎం(ఈ అండ్ ఎం) ఏరియా వర్క్ షాప్ జె.క్రిస్టఫర్, స్పోర్ట్స్ సూపర్వైజర్స్ ఆర్గనైజర్స్ ఇతర అధికారులతో కలసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిఎం శాలెం రాజు మాట్లాడుతూ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహణకు కబడ్డీ కోర్ట్స్, స్టేజ్ ప్రిపరేషన్ పనులను పర్యవేక్షించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పనులను ఏమాత్రం నిర్లక్ష్యం జాప్యం లేకుండా ప్రత్యేక చొరవతో వివిధ కమిటీలుగా ఏర్పడి కంపెనీ లెవెల్ లో నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించి మరల మన కొత్తగూడెం ఏరియాలో కోల్ ఇండియా లెవెల్ క్రీడా పోటీలను నిర్వహించుటకు అనుమతులు పొందేలా ఈ క్రీడలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు ఎస్ఓటు జిఎం జివి.కోటి రెడ్డి, ఎజిఎం(సివిల్) సిహెచ్.రామకృష్ణ, డిజిఎం(పర్సనల్) జీవి.మోహన్ రావు, డిజిఎం(ఈఅండ్ఎం) ఏరియా వర్క్ షాప్ జె.క్రిస్టఫర్, స్పోర్ట్స్ సూపర్వైజర్స్ ఎంసి.పాస్నెట్, జాన్ వెస్లీ, సిహెచ్.అశోక్, పరసా శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ బి.భీముడు, స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ బి.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఆర్గనైజర్స్ సిహెచ్ సాగర్, కే.శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ ప్రేమ్ కుమార్, జి.రాజశేఖర్, ఎస్.కె గులాం గౌస్, మహేష్ ఇతర సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దేవాలయంకు పొలం విరాళం

- ఐదేళ్ల పాటు ఊరంతా ఇంటి, నీటి పన్ను నేనే చెల్లిస్తా
- ఉత్సవాలకు విగ్రహాలు...
- పండుగ ఖర్చులు భరిస్తా మోటాపురం
- సర్పంచ్ అభ్యర్థి మేనిఫెస్టో విడుదల

**నేలకొండపల్లి, మహా :** తనను సర్పంచ్ గా గెలిపిస్తే... వీరన్న స్వామి దేవాలయం కు ఎకరం పొలం విరాళంగా ఇస్తానని మోటాపురం సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం తన మేనిఫెస్టో ను విడుదల చేశారు. తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఊరందరి ఇంటి, నీటి పన్నులు తానే చెల్లిస్తానని అన్నారు. ప్రతీ నెలా ఉచిత వైద్య శిభిరాలు, ఉచిత మందులు, గ్రామం లో ఉన్న ప్రతీ దేవాలయం కు రూ.50 వేల ను. ఉత్సవాల కోసం అందిస్తానని అన్నారు. పాఠశాల విద్యార్థులకు పోటీల కు బహుమతులు అందిస్తానన్నారు. బాగా చదివే విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా అందిస్తాన్నారు. పండుగలకు ముగ్గుల పోటీలు అందించనున్నట్లు పేర్కోన్నారు. అయ్యప్ప మాలధారణ భక్తులకు నిత్య అన్నదానం, ప్రతీ దసరా కు 100 మందికి వస్త్రాలు పంపిణీ, 10 మంది పేద మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తానని అన్నారు. సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ ద్వారా ఇంటింటికి ఉచిత మినరల్ వాటర్ సరఫరా చేస్తానని అన్నారు. పెళ్లిలు, జాతరలకు అవసరమైన డీజేబీ మైక్ లను అందిస్తామని అన్నారు. అదే విధంగా మరణించిన వారికి ఫ్రీజర్ ను ఉచితంగా అందిస్తామన్నారు. స్మశానాని వైకుంఠ రథం ఏర్పాటు చేస్తాన్నారు. పేద కుటుంబాలలో ఆడపిల్ల వివాహానికి చీర, సాకే కానుక.. వికలాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు అందించనున్నట్లు తెలిపారు. తమను సర్పంచ్ గా గెలిపిస్తే మేనిఫెస్టో ను అమలు చేస్తానని మేనిఫెస్టో ను సోషల్ మీడియా లో వైరల్ కావటంతో చర్చంశనీయంగా మారింది.





# ప్రతీ వాహనంను తనీఖీ చేయాలి

**నేలకొండపల్లి, మహా :** ప్రతీ వాహానం ను క్షుణ్ణంగా తనీఖీ చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ, మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి యం.యర్రయ్య సూచించారు. జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెకోపోస్టు ను గురువారం ఆకసిక్మంగా తనీఖీ చేశారు. సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం. డబ్బు. ఇతరత్రా వస్తువులు అక్రమంగా రవాణా చేయకుండా చూడాలని ఆదేశించారు ఎంతటి వారి వాహానం అయినా సరే తనీఖీ చేయాల్సిందేన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయా లని సూచించారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాల రచయిత్రి కొల్లి చంద్రికకు అంతర్జాతీయ గుర్తింపు



**ఖమ్మం సిటీ , మహా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక నవంబర్ 30న ఆన్లైన్లో 13 గంటల పాటు అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం- బాలసాహిత్య భేరి-2025 ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనుటకు ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్ ఎస్ యు కాలనీ పదవ తరగతి విద్యార్థిని,బాల రచయిత్రి కుమారి కొల్లి చంద్రిక ఎంపికయ్యారు. కథ,కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా 101 మంది బాల, బాలికలు పాల్గొంటుండగా చంద్రిక కథ విభాగంలో తన కథను మూడు నిమిషాల్లో వినిపిస్తుంది. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ లు, కేంద్ర సాహిత్య అకాడమీ ఆవార్డు గ్రహీతలు , ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించినందుకు తానా ఆధ్యక్షులు డాక్టర్ నరేన్ కొడాలి ,తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్ ,సమన్వయకర్త చిగురుమల్ల శ్రీనివాసుకు కృతజ్ఞతలు. బాలసాహితీవేత్త కవి రచయిత తెలుగు ఉపాధ్యాయులు కోంద్రు బ్రహ్మంగారి ప్రోత్సాహంలో చంద్రికకు ఈ అవకాశం లభించడం ముదావహం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి చావా దుర్గాభవాని తెలిపారు

# రోడ్డు ప్రమాదంలో చైర్మన్‌కు తీవ్ర గాయాలు



**నేలకొండపల్లి, మహా:** రోడ్డు ప్రమాదంలో టీడీ జేపీసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య కు తీవ్ర గాయాలైయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం లో గురువారం జరిగిన సంఘం సమావేశంలో పాల్గొని పైనంపల్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా... స్థానిక పెట్రోల్ బంక్ వద్ద కు బైక్ దిగుతుండుగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలైయ్యాయి. సహచర సంఘం నాయకులు స్థానిక ప్రభుత్వ హస్పిటల్ కు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. రోడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ టీడీజేపీసీ చైర్మన్ చలమయ్య ను పలువురు సంఘం నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మొదలైన ఎన్నికల సందడి

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల స్వీకరణ ఘట్టం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు నుంచే జిల్లాలోని గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు ఆశావహులు ఉత్సాహం చూపించారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం విడుదల చేసిన అధికారిక నివేదిక ప్రకారం మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 192 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, తొలిరోజే అనూహ్య స్పందన లభించింది. సర్పంచ్ పదవుల కోసం గురువారం ఒక్కరోజే ఏకంగా 99 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్ గిరీ కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు తమ మద్దతుదారులతో తరలివచ్చి అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. నోటిఫై చేసిన పంచాయతీల్లో సగానికి పైగా స్థానాలకు తొలిరోజే నామినేషన్లు రావడం పోటీ తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు వార్డు సభ్యుల స్థానాలకు మాత్రం మొదటి రోజు నామినేషన్ల సంఖ్య పరిమితంగానే నమోదైంది. జిల్లాలో మొత్తం 1740 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, తొలిరోజు కేవలం 49 మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ పదవులతో పోల్చితే వార్డు సభ్యుల నామినేషన్ల వేగం ఇంకా పుంజుకోవాల్సి ఉంది. రానున్న రోజుల్లో నామినేషన్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# పంచాయతీ పోరు...

## తొలి విడుత నామినేషన్ల పర్వం షురూ





**పినపాక, మహా:** పంచాయతీ ఎన్నికల కు సంబంధించి గురువారంతొలి విడత నామినేషన్ల పర్వం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు.గురువారం నుంచి ఈనెల 29 వరకు నామినేషన్లు స్వీకరణ ప్రారంభమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు.తొలి రోజు పినపాక మండలంలో ఏర్పాటుచేసిన ఆరు కేంద్రాలలో సర్పంచ్ అభ్యర్థులు 15 మంది, వార్డు మెంబర్లు 19 మంది నామినేషన్ దాఖలు చేశారు. అమరారం 1, జానంపేట 2, బయ్యారం 1, సీతంపేట 2, పినపాక 2, బోడుగూడెం 1, తో గూడెం -2, ఎల్చిరెడ్డిపల్లి 1, సింగిరెడ్డిపల్లి 1, సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు అయ్యాయి.ఈనెల 30న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు డిసెంబర్ 3వ తేదీ వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు.

# సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన సాధ్యమవుతుందని సమాచార హక్కు కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. గురువారం సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై వచ్చిన అప్పీళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్టీఐ సమీక్షా సమావేశంలో సమాచార హక్కు చట్టం అమలు పెండింగ్ కేసుల పరిశీలన పౌర సమాచార అధికారుల పనితీరుపై ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి విస్తృతంగా సమీక్షించారు. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి శక్తినిచ్చే కీలక సాధనం అని, ఈ చట్టం ద్వారా మాత్రమే ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన సాధ్యమవుతాయి అన్నారు. అవినీతిని నిర్మూలించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం అందువల్ల ప్రతి అధికారి చట్టంలోని నిబంధనలపై సంపూర్ణ అవగాహనతో పని చేయాలి అని స్పష్టం చేశారు. అధికారులు ప్రజలకు సకాలంలో సరైన పూర్తి సమాచారాన్ని అందించడం అత్యవసరమని తెలిపారు. ఆర్టీఐ ద్వారా సమాచారం అందించినప్పుడే ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన అన్నారు. గత రెండేళ్లుగా ఆర్టీఐ కమిషన్ నియామకం లేకపోవడం వల్ల అనేక దరఖాస్తులు, అప్పీలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. పెండింగ్ కేసులన్నింటిని వేగంగా పరిష్కరించేందుకు జిల్లాల వారీగా పర్యటన చేపట్టుతున్నామని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై పూర్తి వివరాలు సేకరించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖలో రికార్డుల నిర్వహణ పద్ధతిని మరింత మెరుగుపరచడం దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా సమాధానం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఆర్టీఐ చట్టం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో అధికారులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పౌర సమాచార అధికారులు తమ శాఖల పరిధిలో ఉన్న కేసుల స్థితిపై వివరాలు కమిషనర్ కు వివరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి శాఖ తమకు వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను సకాలంలో సమాచారం అందించాలని అన్నారు. ప్రతి శాఖ అధికారులు తమ శాఖ పరిధిలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులు వివరాలతో కూడిన రిజిస్టర్ లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, వివిధ శాఖలకు సంబంధించిన పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్

**చింతకాని, మహా:** చింతకాని మండల కేంద్రంలోని సర్పంచ్ స్థానానికి మొదటి నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్ . గురువారం మొదలైన గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్.కిలారు మనోహర్ ఇంటి నుంచి పెద్ద ఎత్తున మండల కేంద్రంలో ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం లో మొదటి నామినేషన్ సెట్ ను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కిలారు జగన్మోహనరావు,మాజీ సర్పంచ్ కిలారు సరోజిని,మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు,బాబూరావు,కోలా నాగేశ్వరావు, రహమతుల్లా, ఖాజా, షంషుద్దీన్, జహీర్, రామకృష్ణ,నాగరాజు,మరియు పెద్ద సంఖ్య లో మనోహర్ బాబు యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ

**ఎరుపాలెం,మహా:** మండల కేంద్రం ఎర్రుపాలెంలోని జర్నలిస్టుల కాలనీ వద్ద శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని గురువారం ఎర్రుపాలెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆంజనేయస్వామి విగ్రహానికి ఉదయం నుండి పురోహితులు కొత్తూరు సీతయ్య శాస్త్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు,గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో ఈ విగ్రహ ప్రతిష్ట పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.విగ్రహ దాత ఎర్రమల పూర్ణచంద్రారెడ్డిని మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# అంతా నా ఇష్టం... నన్ను ఆపేదెవరు...







**అశ్వాపురం, మహా:** అశ్వాపురం మండలంలోని పాములపల్లి గ్రామ సమీపంలోని గోదావరి నది ఒడ్డున అక్రమ ఇసుక రవాణా బహిరంగంగా సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గోదావరి తీరంలో ప్రాజెక్టు కోసం కట్ట నిర్మాణం చేపట్టే పేరుతో భారీగా ఇసుకను పోశారని, ఇప్పటికే దాదాపు 400 లారీలు ఇసుకను కట్ట ప్రక్కన పోసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనుల పేరిట గత నెల రోజులుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు రోజు రోజుకు నది తీరాన ఇసుక తవ్వకాలతో బిజీగా తిరుగుతున్నాయని, దీనిపై అధికారులు మౌనం పాటించడం ప్రజల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది. అధికారుల అనుమతులు లేకుండా ఇంత పెద్ద ఎత్తున రవాణా జరిగే అవకాశం లేదని, “ఎవరి అండదండలతో ఈ అక్రమ ఇసుక రవాణా సాగుతుంది?” అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే సమయంలో, పాములపల్లి%–%బట్టీలగుంపు మార్గం మీదుగా ఇసుక ట్రాక్టర్ల రాకపోకల వల్ల దుమ్ము కమ్మేసి రహదారులపై నడవడం కష్టసాధ్యమైందని, అధిక వేగంతో వెళ్లే ట్రాక్టర్ల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను 2,500 నుండి 3,000 రూపాయలకు విక్రయిస్తున్నారని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇసుక రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపక పోవడం, అందుకు సంబంధించి ఎటువంటి తనిఖీలు జరపకపోవడం వల్ల “ముడుపులు ప్రభావం చూపుతున్నాయా?” అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాములపల్లి–గోదావరి తీరం ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై సంబంధిత అధికారులు తక్షణముగా దర్యాప్తు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ జీ ఎఫ్ అండర్ -19రాష్ట్రస్థాయి క్రికెట్‌లో రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం జట్టు





**పినపాక,మహా:** సంగారెడ్డి జిల్లాలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-19 గర్ల్స్ క్రికెట్ టోర్నమెం ట్‌లో ఖమ్మం జిల్లా జట్టు ప్రతిభావంతమైన ప్రదర్శనతో ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం-హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. ఆసక్తికరంగా సాగిన పోరులో తక్కువ తేడాతో మ్యాచ్ నిర్ణయించబడింది. చివరకు 6 పరుగుల తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా, ఖమ్మం జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ విజయంతో జిల్లా క్రీడా రంగంలో ఉమ్మడి ఖమ్మం జట్టు మరోసారి ప్రతిభను నిరూపించిందని క్రీడాధికారులు అభినందించారు. ఫైనల్ మ్యాచ్ లోను పినపాక మండలానికి చెందిన క్రీడాకారిణి వైష్ణవి రత్న ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

# జాతీయ స్థాయి పోటీలకు కారేపల్లి మోడల్ విద్యార్థులు




కారేపల్లి, మహా : కారేపల్లి పీఎం శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ 69వ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ చూపి పథకాలతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఇలియాట్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బీ.పల్లవీ, వీ.ఉదయ్ కిరణ్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనారని వారు మహారాష్ట్రలో జరుగు జాతీయ పోటీలలో పాల్గంటారన్నారు.రాష్ట్ర స్థాయి పోటీలలో బీ.పల్లవీ, వీ. ఉదయ్‌కిరణ్‌లు బంగారు పతకాలు సాధించగా, ఎస్.సాత్విక్, జీ.యశస్విని, ఎల్.అమూల్యప్రియ,కే.నిక్షిత, ఎం.భరత్ రజత పతకాలు, పీ.విఘ్నేష్ కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఇలియాట్ ప్రేమ్‌కుమార్, పీడీ ముసా మోహినుద్దిన్ లు అభినందించారు.

# సింగరేణి మండలంలో నామినేషన్ స్వీకరించు కేంద్రాలు



**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీలకు సంబంధించి 41 సర్పంచ్, 356 వార్డు సభ్యులు నామినేషన్లు 13 కేంద్రాలలో మాత్రమే స్వీకరించటం జరుగుతుందని సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. సింగరేణి, అప్పాయిగూడెం గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. గేటుకారేపల్లి, రేగులగూడెం, దుబ్బతండా పంచాయతీల నామినేషన్లు గేటుకారేపల్లి జీపీ కార్యాలయం, కొత్తకమలాపురం, పాతకమలాపురం, గంగారంతండా కు చెందిన నామినేషన్లు కొత్తకమలాపురం పంచాయతీ కార్యాలయం స్వీకరించటం జరుగుతుందన్నారు. పేరుపల్లి, సూర్యతండా, రావోజీతండా జీపీల నామినేషన్ల స్వీకరణ పేరుపల్లి జీపీ ఆఫీస్ లో ఉంటుందన్నారు. మాధారం, కొత్తతండా, గుంపెళ్ళగూడెం, మంగళితండా జీపీల నామినేషన్లు మాధారం జీపీ కార్యాలయంలో తీసుకుంటారన్నారు. భాగ్యనగర్‌తండా, గుట్టకిందిగుంపు, పోలంపల్లి జీపీల నామినేషన్లు భాగ్యనగర్‌తండా జీపీ కార్యాలయం, సీతారాంపురం, ఉసిరికాయలపల్లి, చిన్నమడెంపల్లి, తొడితలగూడెం జీపీల నామినేషన్లు సీతారాంపురం జీపీ కార్యాలయంలో స్వీకరించటం జరుగుతుందన్నారు. కోమట్లగూడెం, గాదెపాడు, కొమ్ముగూడెం జీపీల నామినేషన్లు కోమట్లగూడెం జీపీ ఆఫీస్‌లో, మాణిక్యారం, ఎర్రబోడు, మొట్లగూడెం జీపీల నామినేషన్లు మాణిక్యారం జీపీ కార్యాలయంలో స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. విశ్వనాథపల్లి జీపీ కార్యాలయంలో విశ్వనాథపల్లి, భజ్యాతండా, గిద్దవారిగూడెం, వెంకిట్యాతండాల నామినేషన్లు, రేలకాయలపల్లి జీపీ కార్యాలయలో రేలకాయలపల్లి, జైత్రాంతండా, గేటురేలకాయలపల్లి నామినేషన్లు తీసుకోవటం జరుగుతుందన్నారు. చీమలపాడులో జీపీ ఆఫీస్‌లో చీమలపాడు, నానునగర్‌తండా, బోటితండా కి చెందిన నామినేషన్లు, బాజుమల్లాయిగూడెం జీపీలో బాజుమల్లాయిగూడెం, పాటిమీదిగుంపు, టేకులగూడెం జీపీల నామినేషన్లు తీసుకుంటారని ఎంపీడీవో తెలిపారు.

# మరో అక్రమ దందాకు.. దారి చూపిన ఇసుక మాఫియా



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఇసుక మాఫియా మళ్లీ రెచ్చిపోయింది. తమ అక్రమ దందాకు కొత్త మార్గాలు, కొత్త పన్నాగాలు వెతుక్కుంటూ అధికారులను, గ్రామస్థులను, అటవీ సిబ్బందిని ఒకేసారి గందరగోళానికి గురి చేస్తోంది. ఇప్పటికే మల్లేపల్లి - రాజుపేట, చిన్న రాయి గూడెం, అనంతరం, అన్నారం పరిధిలోని ఇసుక ర్యాంపులు ఎన్నోసార్లు ప్రజా ఆందోళనలకు, లారీ, గ్రామస్తుల మధ్య గొడవలకు వేదికైన విషయం తెలిసిందే. మహిళలు, చిన్నారులు సైతం రహదారిపైకి వచ్చి ఆందోళనలు చేసిన దృశ్యాలు ప్రజలు మరచిపోలేదు. ఇలాంటి తరుణంలో జిల్లా ఎస్పీ స్వయంగా జోక్యం చేసుకొని వివాదాలు లేకపోతేనే ర్యాంపులు కొనసాగాలి, లేనిపక్షంలో మూతపడతాయని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారన్న ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.

### అటవీ మార్గం.. చివరికి ఇసుక లారీల రహదారి..!

ఇసుక మాఫియా తమ ఇసుక దందా నిర్వహణ సక్రమంగా నిర్వహించుకునేందుకు మరొక పన్నాగం వేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలున్నాయని, దానిని ఆసరాగా తీసుకొని చిన్న రాయి గూడెం నుంచి గుట్టమల్లారం వరకు అటవీ మార్గాన్ని క్లీన్ చేసి, చెట్లు, మొక్కలు తొలగించి ఇసుక లారీలకు నేరుగా మణుగూరు ప్రధాన రహదారికి చేరేలా కొత్త రహదారి సిద్ధం చేసింది. అటవీ అభివృద్ధి ఛార్జీల పేరుతో ఒక్కో లారీ నుంచి రూ.100, రూ.200లు వసూళ్లకు కలెక్టర్ అనుమతి ఉందని అటవీ సిబ్బంది చెబుతున్నారు. ఇదే ఆధారంగా అటవీ ఉద్యోగులు లారీలను ఆపి నగదు తీసుకుంటున్నారు.

### అదే ఛార్జ్ బొగ్గు లారీలకా..?

లారీలకు వసూలు చేస్తున్న అటవీ సిబ్బంది ఇదే అదనుగా బొగ్గు లారీలకు కూడా వసూలు చేయడం ప్రారంభించారు. దీంతో ఇక్కడే చిక్కు వచ్చింది. ఇసుక లారీలు చెల్లిస్తున్నాయి కాబట్టి బొగ్గు లారీలు కూడా చెల్లించాలి అంటూ అటవీ సిబ్బంది కొత్తగా చెక్‌పోస్టు పెట్టి%ూ% రూ.200 చొప్పున అటవీ చార్జీ వసూలు చేయాలని పట్టుబట్టారు. సింగరేణి మణుగూరు ఏరియా జిఎం కార్యాలయం సమీపంలో బొగ్గు లారీలను నిలిపివేయడంతో వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తమైంది. లారీ యజమానులు అటవీ సిబ్బందిని ఘాటుగా నిలదీశారు. తాము వేబిల్‌లోనే రూ.880 ఫారెస్ట్ ఫీజు చెల్లిస్తున్నాం ఇది ఏ కొత్త పన్నగం..? అని ప్రశ్నించడంతో అక్కడే వాగ్వాదం చెలరేగింది. అటవీ సిబ్బంది మాత్రం డిస్ట్రిక్ ఫారెస్ట్ కమిటీ నిర్ణయం ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం చార్జీ తప్పనిసరి అని తాపత్రయపడుతూ నిలబడ్డారు.

### ఎంఎమ్మెల్యే చెప్పినా లారీలు వదల్లేదు

లారీ డ్రైవర్లు, యజమానులు అటవీ సిబ్బందితో చేసిన వివాదం పెరగడంతో లారీ నిర్వాహకులు స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించగా, ఆయన వెంటనే లారీలు వెళ్లనివ్వండి అని సూచించినా, అటవీ సిబ్బంది వెనక్కు తగ్గలేదని స్థానికులు, లారీ డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో యజమానుల్లో ఆగ్రహం మరింత పెరిగింది. అటవీ చార్జీ చెల్లించాల్సిందేనని అటవీ సిబ్బంది భీష్మించారు.

### సమస్య పరిష్కారానికి రంగంలోకి పోలీసులు..

డ్రైవర్లు, లారీ యజమానుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మణుగూరు సీఐ నాగబాబు ఫారెస్ట్ అధికారులను ఫోన్ ఫోన్ చేసి వివరాలు అడగగా.. వసూల్ పర్వం మాకు తెలియదు పరిశీలిస్తాం అన్న సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల సమాధానం తెలుసుకున్న అటవీ సిబ్బంది కొంగు తిన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. అధికారుల వద్ద స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో, పోలీసులు లారీలను విడిచిపెట్టారు. అటవీ సిబ్బంది ఒక్కసారిగా నిలిచిపోయారు.

### ఫోన్ ఎత్తని తాసిల్దార్

అటవీ ప్రాంతంలో రహదారులు, వసూళ్ల విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల సమాచారం తెలుసుకునేందుకు మణుగూరు తాసిల్దార్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, వ్యవహారం మరింత అనుమానాస్పదంగా మారింది.

### చట్టం ప్రకారమే వసూలు చేస్తున్నాం: ఎఫ్‌డీఓ మక్సూద్

ఏఎన్ఎన్ మహా దినపత్రికతో ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మాట్లాడుతూ.. బొగ్గు లారీలపై వసూలు చేస్తున్న చార్జ్ పూర్తిగా ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం జిల్లా కలెక్టర్ ఛైర్మన్ గా ఉన్న డిస్ట్రిక్ ఫారెస్ట్ కమిటీ నిర్ణయమే. అయితే వివాదం నెలకొన్నందున, సీఐ సూచనల మేరకు ఆదేశాలు రీ వ్యూలో ఉన్నాయని తెలిపారు.

### సీఐ నాగబాబు సీరియస్

ఉత్తర్వులను పున పరిశీలించాకే చర్యలు చేపట్టాలి. అప్పటివరకు చార్జీల వసూళ్లను ఆపండి.. అని అటవీ సిబ్బందినీ మణుగూరు సిఐ పార్టీ నాగబాబు ఆదేశించారు. సిఐ ని ఈ విషయమై వివరణ అడగగా.. తాను ఆ మార్గంలో వస్తుండగా వివాదం తన దృష్టికి వచ్చిందని, వెళ్లి విచారించగా అటవీ సిబ్బంది వద్ద స్పష్టమైన ఆదేశాలు లేనందున లారీలను విడిచి పెట్టామన్నారు. అటవీ సిబ్బందికి జిల్లా అధికారుల ఆదేశాలను పున పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు.

### ప్రభుత్వ జీవో తప్పనిసరి -న్యాయ నిపుణులు..

ఈ మొత్తం వ్యవహారంపై న్యాయ కోవిదులు వివరిస్తూ.. కొత్తగా పన్నులు లేదా చార్జీలు విధించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ జీవో కావాలి. మౌఖిక ఆదేశాలు లేదా కమిటీ తీర్మానాలతో వసూళ్లు చట్టబద్ధం కావని అంటున్నారు. జిల్లా స్థాయి ఫారెస్ట్ కమిటీకి చైర్మన్గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, సభ్యులుగా జిల్లా ఎస్పీ డీఎఫ్ఓ జిల్లా రెవెన్యూ తో పాటు ఇతర శాఖల అధికారులు ఉంటారన్నారు. వీరు ప్రత్యేకంగా ఎటువంటి ఫారెస్ట్ డెవలప్మెంట్ కోసం ప్రభుత్వ జీవో లేకుండా చార్జీ వసూలు చేస్తే చట్టబద్ధత ఉండదన్నారు.



మహా పత్రిక
ANN తెలుగు

## తొలిరోజు సర్పంచ్ 9, వార్డు సభ్యులు ఏడుగురు నామినేషన్లు

**బూర్గంపహాడ్ మహా:** స్థానిక ఎన్నికలలో మొదటి విడతలో భాగంగా బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా డిసెంబర్ 11వ తేదీన జరగనున్న ఎన్నికల కు తొలి రోజు గురువారం మండల వ్యాప్తంగా ఉన్న 18 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ 9 వార్డు సభ్యులు 7 నామినేషన్లు దాఖలు చేశారని మండల ఎన్నికల అధికారి జమలారెడ్డి తెలిపారు. బూర్గంపహాడ్3, ముసలిమడుగు 1, లక్ష్మీపురం 2, సారపాక 2, కోయగూడెం 1 చొప్పున సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. సారపాక 6 సోంపల్లి 1 వార్డు సభ్యులుగా నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇరవెండి, మోరంపల్లి బంజర ,టేకుల చెరువు, నాగినేని ప్రోలు, పినపాక పట్టి నగర్, ఉప్పుసాక ,అంజనాపురం, నకిరిపేట, వేపలగడ్డ, మోతె పట్టి నగర్ ,తాళ్లగొమ్మూరు ,కృష్ణసాగర్ గ్రామాలలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేదని చెప్పారు. కాగా నామినేషన్లకు ఈరోజు రేపు మాత్రమే సమయం ఉండడంతో ఈరోజు అత్యధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం లేకపోలేదు. సమయం తక్కువ ఉండడంతో అభ్యర్థులు చివరి నిమిషం వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## బస్సును ఢీకొని పల్టీ కొట్టిన లారీ

**సత్తుపల్లి, మహా:** పట్టణ శివారులోని పెద్ద వంతెన బ్రిడ్జి పై చేపల మేత లోడ్ తో రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ సత్తుపల్లి వైపు వస్తున్న సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ బస్సును స్వల్పంగా ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో 40 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. మద్యం మత్తులో లారీని వేగంగా నడపడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్ ను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఒలంపియాడ్‌లో ప్రతిభ చాటిన ఈ బయ్యారం విద్యార్థులు



**పినపాక,మహా:** పినపాక మండల స్థాయిలో నిర్వహించిన ఈఎల్ఎటిఏ తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో ఈ.బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలు ప్రదర్శించి ప్రథమ బహుమతులను సాధించారు.జూనియర్స్ విభాగంలో 8వ తరగతి ఇంగ్లీష్ మీడియం కు చెందిన లోహిత్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి దిలీప్ ఫస్ట్ ప్రైజ్ సాధించి మండలానికి గర్వకారణమయ్యారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీ



**నెలకొండపల్లి, నవంబర్ 27 మహా:** గామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీలో ఉంటుందని జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. గురువారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశంను కర్నాటి కృష్ణయ్య భవనంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ ఐదు గ్రామపంచాయతీలో పోటీ చేస్తుందని తెలిపారు. భైరవునిపల్లి, అజయ్ తండా, సదాశివపురం, కొత్త కొత్తూరు, తిరుమలాపురం గ్రామాలలో సిపిఐ పోటీలో ఉంటుందని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్య పై పోరాటం చేసే పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి మాలోతు అయోధ్య, కార్యవర్గ సభ్యులు పాలపాటి అశోక్, అనంతపుల్లయ్య, గణపతి రావు, పుల్లయ్య, ప్రసాద్, రంజిత్, కృష్ణ పాల్గొన్నారు.

## మొరంపల్లి బంజర్ విద్యార్థికి జిల్లా స్థాయి బహుమతి



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన 52వ రాష్ట్ర స్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శన -ఇన్స్పైర్ అవార్డ్స్ మనక్ 2024–25 పోటీలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మొరంపల్లి బంజర్ కు చెందిన 7వ తరగతి విద్యార్థి ఇట్టి వర్షిత్ రూపొందించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా అవార్డును స్వీకరించాడు. ప్రోగ్రాంలో పలు విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యార్థి సాధించిన ఈ ఘన విజయాన్ని జిల్లా విద్యా అధికారి డీయివో నాగలక్ష్మి , మరియు డిఈ వో సంపత్ గారు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ప్రాజెక్టును మార్గనిర్దేశం చేసిన సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ రావు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం పాఠశాల ప్రతిష్టను మరింత పెంచడమే కాక, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడినారు.

## కబడ్డీ టోర్నమెంట్ మేనేజర్స్‌తో పరిచయ కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ టోర్నమెంట్ లో పాల్గొనుటకు వచ్చిన టీం మేనేజర్స్ లతో గురువారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆధ్వర్యంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్ తో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో కబడ్డీ టోర్నమెంట్ లో పాల్గొని తగు జాగ్రత్తలు తీసుకుంటూ క్రీడలను ఆడాలని సూచించారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా టీం మేనేజర్స్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి కిరణ్ కుమార్, ఎస్ఓటు జీఎం జివి. కోటి రెడ్డి, ఎజిఎం(సివిల్) సిహెచ్. రామకృష్ణ, డిజిఎం (పర్సనల్)జీవి మోహన్ రావు, స్పోర్ట్స్ సూపర్వైజర్స్ ఎంసి. పాస్నెట్, జాన్ వెస్లీ, సిహెచ్.అశోక్, పరసా శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను నిర్మూలిద్దాం..




**మణుగూరు, మహా:** బాల్యవివాహాల్ని అరికట్టే దిశగా మణుగూరు పట్టణంలో గురువారం ఎయిడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల భవితవ్యాన్ని చిగురింపజేయాల్సిన సమయంలో బాల్యవివాహాలు వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సామాజిక దుష్ప్రవర్తనను నివారించేందుకు ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో నాగ జ్యోతి, రాంప్రసాద్, ఆశ వర్కర్లు, మనబడి టీచర్లు, ఆర్పీలు, బిసి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో బాల్యవివాహాలను అడ్డుకోవాలి.. చిన్నారి బాల్యాన్ని కాపాడాలి.. వంటి నినాదాలు ఆద్యాంతం వినిపించాయి. చిన్నారుల హక్కుల పరిరక్షణ కోసం సమాజం మొత్తం కట్టుబడి ఉండాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**బూర్గంపహాడ్ మహా:** స్థానిక ఎన్నికల కు సంబంధించి మండల వ్యాప్తంగా 8 నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గురువారం మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ నామినేషన్ స్వీకరణ కేంద్రంలో జిల్లా సాధారణ పరిశీలకులు సర్వేశ్వర్ రెడ్డి, డిపిఓ అనూష ,జెడ్పీ సీఈవో నాగలక్ష్మి లు పరిశీలించారు రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ వేసే వారికి పత్రాలు అందించాలని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. నాగినేని ప్రోలు, సారపాక ,మొరంపల్లి బంజర నామినేషన్ స్వీకరణ కేంద్రాల ను పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్ పరిశీలించారు. నామినేషన్ స్వీకరణకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక ఎస్సై మేడాప్రసాద్ ,సిబ్బందికి సూచించారు.

## గిరిజన లంబాడి జేఏసీ మహిళా విభాగం చైర్మన్ గంగా బాయ్



**టేకులపల్లి - మహా:** గిరిజన లంబాడీ సంఘాల – జేఏసీ మహిళా విభాగం చైర్మన్ గా గంగా బాయిని రవి రాథోడ్ ని అధికార ప్రతినిధి గా ఎన్నిక. అందరు ముక్త కంఠంతో ఏకగ్రీవంగా ఆమోదించడం విశేషం. సమాజ శ్రేయస్సుకోసం, జాతి మనుగడకోసం, మహనీయులు చేసిన పోరాటాల స్ఫూర్తితో, గిరిజన లంబాడీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన మరియు చట్టాల పరిరక్షణే లక్ష్యంగా స్వేచ్ఛా, సమానత్వం, సమన్యాయం అనే నినాదంతో గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జి ఎల్ ఎస్– జేఏసీ) ఏర్పడిందని తెలియజేస్తూ, గిరిజన లంబాడీలపై జరుగుతున్న దాడులను, అసమానతలను తొలగించుటకు గొప్ప ఆశయంతో ఏర్పడ్డ గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ లో ఆత్మ విశ్వాసంతో క్రమశిక్షణ కలిగి సిద్ధాంతాలకు, సమిష్టి నిర్ణయాలకు కట్టుబడి పోరాట పటిమ కలిగిన నాయకురాలిగా, జాతి అభ్యున్నతికి కృషి చేయాలని ఆశిస్తూ జేఏసీ చైర్మన్ లక్ష్మణ్ నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. బిజెపి నాయకులు, విద్యావేత్త, సంఘ సంస్కర్త అయినటువంటి బోడ పునియా నాయక్ గారి సతీమణి అయిన గంగా బాయి గారు, టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పాఠశాల గ్రావిటి ప్రీమియర్ స్కూల్ డైరెక్టర్ గాను, అనేక సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బిజెపి పార్టీ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు.

## నూతన వధూవరులు ఆశీర్వదించిన బచ్చలకూరి నాగరాజు



**నెలకొండపల్లి, మహా:** మండల పరిధిలోని కోర్లట్ల గూడెం గ్రామంలో బచ్చలకూరి వెంకయ్య – ఉప్పలమ్మ కుమారుడు శ్రీకాంత్ ప్రవంతి వివాహానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గం సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈరోజు నుంచి నూతన వధూవరులను దేవుడు చల్లగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వర్లు,బంధువులు,స్నేహితులు, రక్తసంబంధితులు,పెళ్లి కుమారుడు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన హై స్కూల్ విద్యార్థి



**టేకులపల్లి - మహా:** ఈ నెల 25వ ,26వ , 27వ తేదీల్లో సెయింట్ మేరీస్ హై స్కూల్ భద్రాద్రి జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ (2025–26) మరియు ఇన్స్పైర్ అవార్డ్స్ (2024–25) ఎగ్జిబిషన్ లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల టేకులపల్లి విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతి విద్యార్థిని మల్లు .తేజస్వి ఇన్స్పైర్ అవార్డ్స్( 2024–25) లో ప్రదర్శించిన ప్రాజెక్ట్ అంశం “సేఫ్టీ విమెన్ హెయిర్ రబ్బర్ బ్యాండ్ “రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక అయ్యింది .అలాగే సైన్స్ ఫెయిర్ (2025–26) లో” సుస్థిర వ్యవసాయం “అంశం యందు సీనియర్ విభాగంలో పదవ తరగతి విద్యార్థిని యం .ప్రణీత చౌహాన్ జిల్లా స్థాయి తృతీయ బహుమతి ని సాధించారు .ఈ ఘనత సాదించినందుకు మండల విద్యాశాఖాధికారి జగన్ గారు ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం .శ్రీనివాస్ ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు వారిని అభినందించారు .ఈ రెండు ప్రాజెక్ట్స్ లకు గైడ్ టీచర్ గా ఫిజిక్స్ ఉపాధ్యాయుడు యం .మోహన్ రావు వ్యవహరించారు .

## మణుగూరులో నామినేషన్ల జోరు ప్రారంభం..

**మణుగూరు, మహా:** స్థానిక సాధారణ ఎన్నికల వేళ మణుగూరు మండలం రాజకీయంగా కదలికలతో కిక్కిరిసిపోయింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే తొలి రోజే అభ్యర్థుల సందడి ఎన్నికల కార్యాలయాన్ని కోలాహలంగా మార్చింది. గ్రామ పంచాయతీ సర్పంచుల ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో అభ్యర్థులు తమ అనుచరులతో నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల అధికారుల సమాచారం ప్రకారం సర్పంచ్ పదవికి మొత్తం 9 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 23 నామినేషన్లు తొలి రోజునే స్వీకరించబడ్డాయి.